# బలగం BALAGAM TV

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 02 ఫిబ్రవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## క్రీడలకు రూ.3,794 కోట్లు

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

కేంద్ర బడ్జెట్‌లో క్రీడలకు అధిక ప్రాధాన్యత లభించింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను క్రీడలకు రూ.3,794 కోట్లను ఖరారు చేశారు.కిందటి కేంద్ర బడ్జెట్‌లో రూ.3,442 కోట్లను మంజూరు చేశారు.స్పోర్ట్ కేటాయించిన బడ్జెట్‌లో ఖేలో ఇండియాకు ఎక్కువ నిధులను ఇచ్చారు. ఈ ఏడాది అదనంగా రూ.200 కోట్లను కేటాయించారు. దీంతో ఖేలో ఇండియాకు ఇచ్చిన నిధులు రూ.1000 కోట్లకు చేరాయి. క్షేత్ర స్థాయిలో ఉండే యువ క్రీడాకారులను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో ఈ పథకానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. మరోవైపు జాతీయ క్రీడల సమాఖ్యకు ఇచ్చే నిధులను కూడా కేంద్రం పెంచింది. ఈసారి సమాఖ్యకు అదనంగా రూ. 60 కోట్లను మంజూరు చేసింది. దీంతో క్రీడల సమాఖ్య బడ్జెట్ రూ.400 కోట్లకు చేరింది. ఇక యువతను సామాజిక కార్యక్రమాలు, ప్రజా సేవలో భాగం చేసుందుకు అమలు చేస్తున్న నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్)కు కేటాయించే బడ్జెట్‌ను ఏకంగా రూ.200 కోట్లను పెంచింది. దీంతో ఎన్ఎస్ఎస్ స్కీమ్ బడ్జెట్ రూ.450 కోట్లకు చేరింది. కాగా, రానున్న రోజుల్లో భారత్‌లో విశ్వ క్రీడలు ఒలింపిక్స్ నిర్వహించాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది.



# మధ్య తరగతిపై వరాల జల్లు

- 2025-26 బడ్జెట్ మొత్తం రూ.50,65,345 కోట్లు
- రూ.12 లక్షల వరకు నో ట్యాక్స్.. ఆదాయపు పన్నులో సవరణలు
- వేతన జీవులకు ఊరట కల్పించే ప్రకటన
- టీడీఎస్ వడ్డీ ఆదాయ పరిమితి రూ.లక్షకు పెంపు
- రాష్ట్రాలకు రూ.1.5 లక్షల కోట్ల రుణాలు ప్రకటించిన కేంద్ర మంత్రి
- మరో 120 రూట్ లలో ఉడాన్ పథకం అమలు
- గిగ్ వర్కర్లకు ఆరోగ్య బీమా
- బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలు
- రూ.47 వేల కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం
- మెడికల్ టూరిజంలో ప్రయివేటు పెట్టుబడులు
- గిగ్ వర్కర్లకు బీమా రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను
- రికార్డు స్థాయిలో 8వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్

కేంద్రం 2025-26 బడ్జెట్‌ను పార్లమెంటు ముందు ఉంచింది. వికసిత్ భారత్ దిశగా సంస్కరణలు కొనసాగిస్తామని చెబుతూనే సంక్షేమానికి పెద్దపీట వేసింది. చరిత్రలో తొలిసారి వేతన జీవులకు 12 లక్షల వరకూ ఆదాయ పన్ను మినహాయింపులు కల్పించింది. మొత్తం రూ.50,65,345 కోట్లతో నూతన బడ్జెట్‌ను ప్రతిపాదించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన 2025-26 వార్షిక బడ్జెట్ లో వేతన జీవులకు ఊరట కలిగించారు. రూ.12 లక్షల 75 వేల గ్రూపాయల లోపు ఆదాయం కలిగిన వాదాయం పన్ను కట్టనవసరం లేకుండా మినహాయింపు ఇచ్చారు. రూ.50 లక్షల కోట్ల పైచిలుకు పెట్టుబడులతో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి.. ఎనిమిది రంగాలను ఫోకస్ చేసుకొని కేటాయింపులు జరిపారు. పెట్టుబడులను సమకూర్చుకోవడానికి, నిర్భర భారత్ లక్ష్యాన్ని సాధించడానికి దోహదం చేసేదిగా బడ్జెట్ ఉందని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు మాత్రం బడ్జెట్ పై పెదవి విరిచాయి. బుల్లెట్ గాయానికి బాండ్ ఎయిడ్ ట్రీట్మెంట్ ఇచ్చినట్టుగా బడ్జెట్ ఉందని ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రానికి మాత్రం బడ్జెట్ లో తీరని అన్యాయం జరిగింది. రాష్ట్రం పేరు కూడా ప్రస్తావించకుండా, కేటాయింపులు జరపకుండా మరోసారి నిర్లక్ష్యం చేశారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇది కాంగ్రెస్, బీజేపీ వైఫల్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణకు జరిగిన అన్యాయానికి నిరసనగా టీపీసీసీ ఆదివారం ఆందోళనకు పిలుపునిచ్చింది.

వివరాలు 2వ పేజీలో

## మొత్తం బడ్జెట్ : రూ.50,65,345 కోట్లు

| | |
|---|---|
| రెవెన్యూ వసూళ్లు | : రూ.34,20,409 కోట్లు |
| మూలధన వసూళ్లు | : రూ.16,44,936 కోట్లు |
| రెవెన్యూ వ్యయం | : రూ.39,44,255 కోట్లు |
| మూలధన వ్యయం | : రూ.11,21,090 కోట్లు65,345 కోట్లు |

## ప్రధాన రంగాలవారీగా కేటాయింపులు



1. రక్షణ - రూ.4,91,732 కోట్లు
2. గ్రామీణాభివృద్ధి - రూ.2,66,817 కోట్లు
3. హోం వ్యవహారాలు - రూ.2,33,211 కోట్లు
4. వ్యవసాయం మరియు అనుబంధ కార్యకలాపాలు - రూ.1,71,437 కోట్లు
5. విద్య - రూ.1,28,650 కోట్లు
6. ఆరోగ్యం - రూ.98,311 కోట్లు
7. పట్టణాభివృద్ధి - రూ.96,777 కోట్లు
8. ఐటీ మరియు టెలికాం - రూ.95,298 కోట్లు
9. విద్యుత్ - రూ.81,174 కోట్లు
10. వాణిజ్యం, పరిశ్రమ - రూ.65,553 కోట్లు
11. సామాజిక సంక్షేమం - రూ.60,052 కోట్లు
12. శాస్త్రీయ విభాగాలు - రూ.55,679 కోట్లు

## భారతీయుల ఆకాంక్షలు నెరవేర్చే బడ్జెట్

- ప్రధాని మోడీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**



140 కోట్ల భారతీయుల ఆకాంక్షలను ఈ బడ్జెట్ నెరవేరుస్తుందన్నారు. బడ్జెట్‌పై శనివారం మధ్యాహ్నం మోదీ స్పందించారు.'భారత్ అభివృద్ధి ప్రయాణంలో ఈరోజు అత్యంత ముఖ్యమైనది. ఇది 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలకు సంబంధించిన బడ్జెట్.ఈ బడ్జెట్ ప్రతీ భారతీయుడి కలను నెరవేరుస్తుంది. బడ్జెట్ ద్వారా అనేక రంగాల్లో యువతకు కొత్త అవకాశాలు లభిస్తాయి. సామాన్యులే వికసిత్ భారత్ మిషన్‌ను ముందుకు తీసుకువెళ్లేలా ఈ బడ్జెట్ తోడ్పడుతుంది. సాధారణంగా ప్రభుత్వ ఖజానను ఎలా నింపాలన్నదానిపై బడ్జెట్ ఫోకస్ ఉంటుంది. కానీ ఈ బడ్జెట్ సామాన్యుల జేబులు ఎలా నింపాలన్నదానిపై దృష్టి పెట్టి రూపొందించినది. ఈ బడ్జెట్‌తో దేశ పౌరులు తమ కష్టార్జితాన్ని పొదుపు చేసుకునేందుకు వీలు కలుగుతుంది. తద్వారా వినియోగం కూడా పెరిగి ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పడుతుంది. అణు ఇంధన రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు తలుపులు తెరవడం లాంటి చర్యలు ఈ బడ్జెట్‌లో తీసుకువచ్చిన గొప్ప సంస్కరణలు'అని ప్రధాని కొనియాడారు.

## జాతీయ పార్టీలు తెలంగాణ ప్రయోజనాలు కాపాడలేవు

**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



జాతీయ పార్టీలు ఎప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేవని మరోసారి కేంద్ర బడ్జెట్‌తో మరోసారి రుజువైందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ రెండు పార్టీల నుంచి చెరో ఎనిమిది మంది ఎంపీలను గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే ఆ 16 మంది కలిసి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తెచ్చింది అక్షరాల గుండు సున్నా అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన రేవంత్ రెడ్డి బీజేపీతో చీకటి ఒప్పందాలు చేసుకోవడం వల్ల ఇవాళ ఈ పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. వరుసగా రెండో ఏడాది తెలంగాణకు చిల్లి గవ్వ కూడా తీసుకురాలేకపోయిన బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్, బీజేపీలకు చెందిన ఎంపీలు తెలంగాణ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమైన బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ హక్కులను, జాతి ప్రయోజనాలను కాపాడగలుగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ సార్ చెప్పిన మాట ఈ రోజు మరోసారి గుర్తుకు వస్తుందన్నారు. లోక్ సభలో తెలంగాణ పార్టీ అయినా బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం లేకుంటే జరిగే నష్టం ఏమిటో ప్రజల గమనిస్తున్నారన్నారు. పార్లమెంట్‌లో ప్రాంతీయ పార్టీలకు బలమున్న బిహార్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు దక్కిన ప్రాధాన్యం చూసి జాతీయ పార్టీలను గెలిపిస్తే తెలంగాణను నిండా ముంచారని ప్రజలకు అర్థం అయ్యిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 30 సార్లు ఢిల్లీకి పోయింది తెలంగాణకు నిధులు తెచ్చేందుకు కాదని, తెలంగాణ నుంచి ఢిల్లీకి మూటలు మోసేందుకేనని ఈ రోజు తెలిపోయిందన్నారు. కాంగ్రెస్ సీఎంగా ఉంటూ బీజేపీకి గులాంగిరీ చేస్తూన్న బడే భాయ్– చోటే భాయ్ అనుబంధంతో తెలంగాణకు నయాపైసా లాభం లేదని తేలిపోయిందన్నారు.

తెలంగాణ నుంచి మరో ఎనిమిది మంది కాంగ్రెస్

మిగితా 2వ పేజీలో

## కేంద్ర బడ్జెట్ ద్వారా తెలంగాణకు లబ్ది

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



: కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎంతో ప్రత్యేకమైందని.. ఇది మధ్య తరగతి ప్రజల డ్రీమ్ బడ్జెట్ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ ఈ బడ్జెట్ లో కేంద్రం పేదరిక నిర్మూలన, మౌలిక వసతుల కల్పనకు కేంద్రం ప్రాధాన్యం ఇచ్చిందని ఆయన తెలిపారు. మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులకు ఎంతో మేలు చేసే బడ్జెట్ ఇది అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదాయం కోల్పోతున్నప్పటికీ ప్రజల శ్రేయస్సు కోసం మోడీ సర్కార్ రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇచ్చిందన్నారు. ఎంతో గొప్ప నిర్ణయం తీసుకుని ప్రజలకు ఎంతో మేలు చేసిం దన్నారు. వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా వేసిన మొదటి అడుగు అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కరోనా, ఆ తర్వాత యుద్ధాల కారణంగా చాలా దేశాల్లో ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నామయ్యాయన్నారు. తెలంగాణకు ఏమి ఇచ్చారని కొందరు ప్రశ్నిస్తున్నారని.. అయితే ఇది రాష్ట్ర బడ్జెట్ కాదని.. అన్నారు. కేంద్రం అమలు చేసే అన్నిపథకాల్లో తెలంగాణ భాగస్వామిగా ఉంటుందన్నారు. ఈ బడ్జెట్‌లో తెలంగాణకు కూడా లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు.వచ్చే ఐదేళ్లలో ఎంఎస్ఎంఈలకు బడ్జెట్లో రూ.1.50 లక్షల కోట్లు కేటాయించారని తెలిపారు. ఇందులో తెలంగాణకు కూడా లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్రంలో 10 లక్షలకు పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయని.. దేశవ్యాప్తంగా 27 రంగాల్లో స్టార్టప్ కంపెనీలు ఉన్నాయన్నారు. వీటి కోసం రూ.10 వేల కోట్లతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. దీని ద్వారా తెలంగాణలో ఉన్న స్టార్టప్ కంపెనీలకు లబ్ధి చేకూరుతుందని కేంద్ర మంత్రి వివరించారు. 50 ఏళ్ల వరకు వడ్డీ రహిత రుణాలతో తెలంగాణ లబ్ధి జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఏం సంస్కరణలు తీసుకువచ్చినా వాటి ఫలితాలు తెలంగాణ రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు ఉంటాయని కిషన్ రెడ్డి వివరించారు. ఇప్పటికే అమలు అవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల పరిధిని.. నిధుల వాటాను కూడా ఈసారి బడ్జెట్‌లో పెంచిన విషయాన్ని వెల్లడించారు. అర్బన్ స్టేట్‌గా ఉన్న తెలంగాణకు రూ.10వేల కోట్లు రాబోతున్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 125 అర్బన్ లోకల్ బాడీస్‌కు అమృత్ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని చెప్పారు. స్వనిధి పథకం కింద రాష్ట్రంలో ఉన్న వీధి వ్యాపారులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ స్వనిధి పథకం కింద రాష్ట్రంలో 7.5 లక్షల మంది లబ్ధి పొందారని తెలిపారు.

## తెలంగాణకు గాడిద గుడ్డే

- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

వివరాలు 2వ పేజీలో

## బుల్లెట్ గాయాలకు బ్యాండ్ ఎయిడ్ వేసినట్టుంది

- ఎంపీ రాహుల్‌గాంధీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**



బుల్లెట్ గాయాలకు బ్యాండ్ ఎయిడ్ వేసినట్టుంది కేంద్ర బడ్జెట్‌పై లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ప్రపంచమంతా అస్థిరత నెలకొని ఉందని, ఇలాంటి సమయంలో దేశ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుకోవాల్సిన అవసరం ఉన్నదని, కానీ ప్రభుత్వం దివాళా కోరు ఆలోచనలు చేస్తున్నదని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్‌ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. బడ్జెట్‌లోని సానుకూల అంశాలు, లోపాల ప్రస్తావన ఎత్తకుండా రాహుల్‌గాంధీ నేరుగా 'బుల్లెట్ గాయాలకు బ్యాండ్ ఎయిడ్ లా బడ్జెట్ ఉంది' అని వ్యాఖ్యానించారు. అయితే మరోవైపు ప్రధాని నరేంద్రమోదీ మాత్రం బడ్జెట్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ బడ్జెట్‌ను దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షల బడ్జెట్‌గా అభివర్ణించారు. ఈ మేరకు ప్రధాని మోదీ ఒక వీడియో ప్రసంగాన్ని విడుదల చేశారు.


## ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్..

- 8 మంది మావోయిస్టులు మృతి

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మరో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. బీజాపూర్ జిల్లా, గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మావోయిస్టులు, భద్రత బలగాల మధ్య శనివారం ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. గంగలూరు అడవుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు ఉన్నారని నిఘా వర్గాల పక్కా సమాచారంతో బీజాపూర్ నుంచి డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్, కోబ్రా 252, సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ సిబ్బందితో కూడిన బృందం ఇక్కడ అడవుల్లో ఆపరేషన్‌కు బయలుదేరి వెళ్ళాయి. ఈ సమయంలో భద్రత బలగాలపై మావోయిస్టులు కాల్పులు ప్రారంభించడంతో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో ఎనిమిది మంది మావోయిస్టులు మృతి చెందారు. సంఘటన ప్రాంతం నుంచి ఇన్సాస్ రైఫిల్, బిజిఎల్‌తో సహా పెద్దఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని బస్తర్ ఐజి సుందర్ రాజ్ ధ్రువీకరించారు. పది రోజుల క్రితం గరియాబంద్ జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి తో పాటు 16 మంది మావోయిస్టులు హతమైన విషయం తెలిసిందే.

## పురుగుల మందు తాగి బావ, మరదలు ఆత్మహత్య



**బలగం టీవీ, ఆదిలాబాద్**

ఓ కుటుంబం మొత్తం అప్పుల వేదన భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. దానిలో భాగంగానే పురుగుల మందు తాగి రాకేశ్(40), ఆయన మేన మరదలు(17) మృతి చెందారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఉమ్డం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే తమ సొంతూళ్లనే వ్యవసాయం చేస్తూ ఆకుల రాకేశ్ అనే వ్యక్తి ఆదిలాబాద్‌లో క్రిమిసంహారక మందుల దుకాణం నడుపుతున్నారు. తనకు భార్య లావణ్య, పదేళ్ల వయస్సున్న కూతురు ఉన్నారు. ఏఎన్ఎం శిక్షణ తీసుకొన్న రాకేశ్ మేనమామ కూతురు వారి వద్దే ఉంటోంది. ఆమెకు తల్లి, తండ్రి లేరు. రాకేశ్ వేర్వేరు వ్యక్తుల వద్ద సుమారుగా రూ.60 లక్షలు అప్పుచేశాడు. ఆ డబ్బులను తమకు తెలిసిన రాకేందర్‌కు అప్పుగా ఇచ్చారు. రాకేశ్‌కు అప్పు ఇచ్చిన వ్యక్తులు డబ్బులను అడుగుతుండడంతో, ఇతను రాకేందర్‌ను అడిగాడు. రాకేందర్ వాయిదాలు వేస్తూ వచ్చాడు. దీంతో రాకేశ్ కుటుంబం తీవ్రమైన మనోవేదనకు గురయ్యింది. దీంతో కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు వీరంతా కలిసి శనివారం ఆత్మహత్య చేసుకోవడానికి పొలానికి వెళ్లారు. అనుకున్న ప్రణాళిక ప్రకారమే రాకేశ్, అతని భార్య, మేన మరదలు పురుగుల మందు తాగారు. వీరిని కొంతమంది స్థానికులు చూసి ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలిస్తుండగానే రాకేశ్, ఆయన మేన మరదలు ప్రాణాలు విడిచారు. రాకేశ్ భార్య లావణ్య అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెకు వైద్యులు ట్రీట్‌మెంట్ అందిస్తున్నారు.



## 5న అసెంబ్లీ ప్రత్యేక భేటీ..

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఈ నెల 5న తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం కానున్నది. కుల గణన నివేదికను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనున్నది. ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. కుల గణనపై కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. భేటీలో ఉత్తమ్‌తో పాటు పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. ఆదివారం మంత్రివర్గ ఉప సంఘానికి కుల గణన నివేదిక అందుతుందని తెలిపారు. ఈ నెల 5న మంత్రివర్గం ముందుకు కుల గణన నివేదిక వస్తుందని చెప్పారు. కేబినెట్ ఆమోదం అనంతరం అసెంబ్లీ ముందుకు కలగణన నివేదిక తీసుకువస్తామన్నారు. ఈ నెల 5న మధ్యాహ్నం అసెంబ్లీ ప్రత్యేక సమావేశం జరుగుతుందని.. సమావేశంలో కుల గణన నివేదికను ప్రవేశపెడుతామన్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా విజయవంతంగా కులగణన పూర్తయ్యిందని వివరించారు.

## సచిన్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు




**బలగం టీవీ, ముంబై**

బీసీసీఐ వార్షిక అవార్డుల ప్రదానోత్సవం ముంబైలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్రికెటర్లకు అవార్డులు అందజేశారు. ఈ అవార్డుల్లో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు అరుదైన గౌరవం దక్కింది. సచిన్ టెండూల్కర్‌ను సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించింది. ఈ క్రమంలో సచిన్ టెండూల్కర్‌కు ఐసీసీ చైర్మన్ జై షా అవార్డును అందజేశారు. 2023–24 సంవత్సరంలో అత్యుత్తమ అంతర్జాతీయ పురుష క్రికెటర్‌గా టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను బీసీసీఐ ఎంపిక చేసింది. అలాగే ఉత్తమ అంతర్జాతీయ మహిళా క్రికెటర్‌గా స్టార్ ప్లేయర్ స్మృతి మంధాన ఎంపికైంది.

**బీసీసీఐ అవార్డులు అందుకున్న స్టార్ ప్లేయర్లు**

సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు : సచిన్

పాలి ఉమ్రిగర్ అవార్డు – ఉత్తమ అంతర్జాతీయ పురుష క్రికెటర్ : బుమ్రా

ఉత్తమ అంతర్జాతీయ అరంగేట్రం (పురుషులు) : సర్ఫరాజ్ ఖాన్

బీసీసీఐ స్పెషల్ అవార్డు: రవిచంద్రన్ అశ్విన్

దేశీయ క్రికెట్‌లో ఉత్తమ అంపైర్: అక్షయ్ తోట్రే

ఉత్తమ అంతర్జాతీయ మహిళా క్రికెటర్ : స్మృతి మంధాన

ఉత్తమ అంతర్జాతీయ అరంగేట్రం (మహిళలు) : ఆశా శోభనా

వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన మహిళా క్రికెటర్: స్మృతి మంధాన

వన్డేల్లో అత్యధిక వికెట్లు తీసిన మహిళా క్రికెటర్ : దీప్తి శర్మ

# మధ్య తరగతిపై వరాల జల్లు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పార్లమెంట్ లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2015–26 వార్షిక బడ్జెట్ లో మధ్య తరగతి ప్రజలపై వరాల జల్లు కురిపించారు. వరుసగా ఎనిమి దోసారి నిర్మల మ్మ కేంద్ర బడ్జెటి ప్రవేశపెట్టా రు. బడ్జెట్ ప్రసంగంలో ముందుగా నిర్మలమ్మ తెలుగు కవి గురజాడ అప్పారావు మాటలను ప్రస్తావించారు. 'దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషు లోయ్ "అంటూ తన ప్ర సంగాన్ని ప్రారంభిం చారు. దేశాన్ని అన్నిరం గాల్లో అభివృద్ధి చేసేందుకు మోడీ ప్రభుత్నం కృషి చేస్తోంద న్నారు. మొత్తం రూ. 50 లక్షల 65 వేల 145 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టానని వెలకించారు.

### రూ.12 లక్షల వరకు నో ట్యాక్స్

నిర్మలా సీతారామన్ ఓ సంచలన చేశారు. రూ 12 లక్షలలోపు వార్షిక ఆదాయం తిన్నవారికి పూర్తిగా ఉన్న వినహాయింపు బడ్జెట్లో ప్రకటించారు 12 లక్షలకు మించిన ఆదాయం ఉన్న వారికి యితీగా కేంద్రం పన్ను విధించ నుంది. రూ.20 లక్షల నుంచి రూ. 24 లక్షల వరకు 5శాతం పన్ను 24లక్షల ఆదాయం దాటిన వారికి 30 శాతం శాతం పన్ను విరించిన ఆదాయంపై 20 శాతం పన్ను వసూలు నే మాపాయల వరకు పన్ను మిరహాయింపు

అప్పుల రెక్కలను వెల్లడించారు ప్రధాన రంగాలకు నిమ్మ కీలక బాయిలు చేశారు. రక్షణరూ కోట్లు గ్రామీణాభివృద్ధికి రూ. 2.66.817 సాయ అనుబంధరంగానికి రూ.17 1 కోట్లు, పట్టబాభి రూ. 95.28 కోట్లు విద్యుత్ కురూ 31,174 కోట్లు సాహజిక సంక్షేమం రూ. 60.052 కోట్లు లా సీతారామన్ ప్రతిపాదించారు. శాతు నుంచి ఆశావాదం వృక్షణ చేశారు విధంగా కేంద్ర ఎక్ర యం 5 శాతు పండని అందరగా వెల్లడించారు.

### ఎస్సీ, ఎస్టీ మహిళలకు తీపి కబురు

ఈ బడ్జెట్‌లో షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన మహిళలకు కేంద్రం తీపి కబురు చెప్పింది. ఎస్సీ, ఎస్టీ మహిళల కోసం టర్మ్ లోన్ పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో రూ. 2కోట్ల వరకు రుణాలు అందించనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ పథకం ద్వారా మొత్తం 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రయోజనం చేకూరుతుందని మంత్రి పేర్కొన్నారు. తొలిసారి సొంత వ్యాపారాలను ప్రారంభించే, ఉన్న వ్యాపారాలను విస్తరించాలనుకునే మహిళలకు ఈ పథకం ఉపయోగపడుతుంది. అలాగే ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా మహిళలకు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని నిర్మలా సీతారామన్ చెప్పారు.

### రాష్ట్రాలకు రూ.1.5 లక్షల కోట్ల రుణాల

రాష్ట్రాలకు రూ.1.5 లక్షల కోట్ల రుణాలు అందజేయనున్నట్లు ప్రకటించారు. మూలధన వ్యయాల కోసం 50 ఏళ్లకు వడ్డీ రహిత రుణాలు అందజేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు సంస్కరణలు అమలుచేస్తే ప్రోత్సాహకాలు ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

ఉడాన్ పథకాన్ని మరిన్ని రూట్లకు విస్తరించాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి నిర్మల బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. ఇప్పుడు అమలుచేస్తున్న రూట్లకు అదనంగా మరో 120 రూట్లలో కొత్త ఉడాన్ పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. మొత్తంగా వచ్చే పదేళ్లలో 4 కోట్ల మందికి విమాన ప్రయాణ సదుపాయం కల్పించడమే లక్ష్యమని మంత్రి ప్రకటించారు. అదేవిధంగా బీహార్ లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ శ్రమ్ పోర్టల్ కింద గిగ్ వర్కర్లను నమోదు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. పీఎం జన్ ఆరోగ్య యోజన పథకం కింద గిగ్ వర్కర్లకు ఆరోగ్య బీమా సదుపాయం కల్పిస్తామని చెప్పారు. ఈ నిర్ణయంతో కోటి మంది గిగ్ వర్కర్లకు ప్రయోజనం కలగనుందని వివరించారు.

### విద్యా శాఖకు రూ. 1.28 లక్షల కోట్లకు పైగా కేటాయింపు

అదనంగా 6500 మంది విద్యార్థులను చేర్చుకోవడానికి ఐదు కొత్త ఐఐటిలో మౌలిక వసతుల విస్తరణ, పది వేల కొత్త వైద్య సీట్లు, కృత్రిమ మేధ (ఎఐ)కి ఇతోధిక ప్రోత్సాహం. 202526 బడ్జెట్‌లో విద్యా రంగం కోసం ప్రభుత్వం చేసిన భారీ ప్రకటనల్లో అవి కూడా ఉన్నాయి. కేంద్ర బడ్జెట్ 202526లో విద్యా మంత్రిత్వశాఖకు రూ. 1.28 లక్షల కోట్లకు పైగా కేటాయించడమైంది. 202425లో సవరించిన అంచనా రూ. 1.14 లక్షల కోట్ల కన్నా ఇది బాగా అధికం. ఉన్నత విద్య విభాగానికి రూ. 50067 కోట్లు మొత్తం కేటాయించగా పాఠశాల విద్య విభాగం రూ. 78572 కోట్లు అందుకున్నది. వరుసగా ఎనిమిదవ కేంద్ర బడ్జెట్‌ను సమర్పించిన ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పాఠశాలలు, ఉన్నత విద్య కోసం భారతీయ భాష పుస్తకాలను డిజిటల్ రూపంలో సమకూర్చేందుకు ప్రభుత్వం 'భారతీయ భాషా పుస్తక్' పథకాన్ని ప్రారంభించగలదని కూడా తెలియజేశారు.

దేశంలో వెనుకబడి జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహించడంతో పాటు గోదా ములు, నీటి పారుదల, రుణ సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. లోక్‌సభలో ఎనిమిదోసారి కేంద్ర బడ్జెట్ 2025–26ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగించారు. దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. వ్యవసాయం, ఎంఎస్ఎంఇ, ఎగుమతులు, పెట్టుబడులతో పాటు ఆరు రంగాల్లో సమూల మార్పులు తీసుకోస్తున్నామన్నారు. పిఎం ధన్‌ధాన్య కృషి యోజన పేరుతో కొత్త పథకం తీసుకరావడంతో పాటు 100 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తామని, 1.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. వలసలు అరికట్టడంపై ప్రధానంగా దృష్టి పెడుతున్నామని స్పష్టం చేశారు. బిహార్‌లో మకానా బోర్డు ఏర్పాటు చేస్తున్నామని, కిసాన్ క్రెడిట్ కార్డ్ పరిమితి పెంపు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నామని, పత్తి ఉత్పాదకత పెంచేందుకు స్పెషల్ మిషన్ ఏర్పాటు చేశామని, పప్పు ధాన్యాల ఉత్పత్తికి స్వయం సమృద్ధి పథకం ఏర్పాటు చేశామన్నారు.

పోస్టల్ రంగానికి కొత్త జవసత్వాలు నింపడంతో పాటు ఎంఎస్ఎంఇలకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అధిక వృద్ధి రేటు సాధిస్తున్న దేశాల్లో భారత్ ఒకటి అని నిర్మలా సీతారామన్ ప్రశంసించారు. సున్నా శాతం పేదరికమే మా లక్ష్యమని, వికాస్ భారత్‌లో వంద శాతం క్వాలిటీ విద్య ఉంటుందని, 2024–25లో ఎకానమీ వృద్ధి అంచనా 6.4 శాతం, 2025–26కు అంచనా 6.3–6.8 శాతానికి తీసుకెళ్తామన్నారు. సబ్ కా వికాస్‌కు వచ్చే ఐదేళ్లు సువర్ణవకాశం ఉంటుందన్నారు. మేం చేపట్టిన సంస్కరణలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశాలుగా మారాయని, ఆరు రంగాల్లో సమూల మార్పులు చేస్తామని, 1.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం ఉంటుందని, ఇన్‌ఫ్రా, మధ్యతరగతి ప్రజల వికాసమే లక్ష్యంగా ఐదేళ్ల ప్రణాళిక ఉంటుందని, పప్పుధాన్యాల కోసం ఆరు సంవత్సరాల ప్రణాళిక ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. లాజిస్టిక్ వ్యవస్థగా ఇండియన్ పోస్ట్, పోస్టల్ శాఖకు కొత్త రూపు ఇచ్చేలా ప్రణాళిక, ఈశాన్య రాష్ట్రాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు ప్రోత్సాహం, నేషనల్ మ్యాన్‌ఫ్యాక్షరింగ్ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త హంగులు దిద్దామని, అన్ని ప్రభుత్వ స్కూల్స్‌కు బ్రాడ్‌బ్యాం డ్ సేవలు అందిస్తున్నామని, పదేళ్లలో ఐఐటిల్లో విద్యార్థుల సంఖ్య రెట్టింపుగా మారిందని, ఐఐటి పాట్నా విస్తరణకు నిర్ణయం తీసుకున్నామని, విద్యారంగంలో ఎఐ వినియోగం తీసుకొస్తున్నామని, ఐదేళ్లలో అదనంగా 75 వేల మెడికల్ సీట్లు ఏర్పాటు చేశామని, బిహార్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఏర్పాటు చేయడంతో రూ.30 వేలతో స్ట్రీట్ వెంటర్స్‌కు క్రెడిట్ కార్డులు ఇచ్చామని, బొమ్మల తయారీకి ప్రత్యేక పథకం రూపొందించామన్నారు.

అన్ని జిల్లా ఆస్పత్రుల్లో డే–కేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు కోటి మంది గిగ్ వర్కర్లకు ఆరోగ్య బీమా, 50 వేల ప్రభుత్వ పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ శిక్షణ కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సంస్కరణలు అమలు చేసే రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు 50 ఏళ్లకు వడ్డీ రహిత రుణాలు ఇస్తామని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు.

**ధరలు తగ్గేవి:**

- క్యాన్సర్ మందులు
- ప్రాణాలను రక్షించే మందులు
- ఫ్రోజెన్ చేపలు, చేపల పేస్ట్
- వెట్ బ్లూ లెదర్
- క్యారియర్-గ్రేడ్ ఈథర్నెట్ స్విచ్‌లు
- 12 కీలకమైన ఖనిజాలు, ఓపెన్ సెల్
- ఎల్‌సీడీ, ఎల్ఈడీ టీవీలు
- భారతదేశంలో తయారైన దుస్తులు
- మొబైల్ ఫోన్లు, తోలు వస్తువులు
- వైద్య పరికరాలు

**ధరలు పెరిగేవి:**

- ఫ్లాట్ ప్యానెల్ డిస్ ప్లే
- సిగరెట్లు

## జాతీయ పార్టీలు తెలంగాణ ప్రయోజనాలు కాపాడలేవు

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీలు గెలిచినా.. వారితో కూడా రాష్ట్రానికి దక్కింది గుండు సున్నానే అన్నారు. కేవలం ఢిల్లీ బాసులను ప్రసన్నం చేసుకునే పని తప్ప.. ఏనాడూ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించిన పాపాన

పోలేదన్నారు. కేంద్ర బడ్జెట్‌కు తెలంగాణకు రావాల్సిన వాటా గురించి పోరాడిన దాఖలు లేకపోవడం వల్లనే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని కేటీఆర్ మండిపడ్డారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ, కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడితే తెలంగాణకు నిధులు తేస్తామంటూ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ గెలిచినా, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా తెలంగాణకు ఒక్క నయా పైసా తీసుకురాలేకపోయారన్నారు. ఇతర రాష్ట్రాలనుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు తమ రాష్ట్రాలకు నిధుల వరద పారిస్తుంటే.. తెలంగాణ బీజేపీ ఎంపీలు, నిస్సహాయ మంత్రులు చేతకాని దద్దమ్మల్లా వ్యవహరిస్తున్నారు. తెలంగాణకు నిధులు తేలేని బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## కొత్త ఐటీ శ్లాబు.. పాత ఐటీ శ్లాబుల వివరాలు

1. రూ.4 లక్షల వరకు నో ట్యాక్స్ (గతంలో రూ.3 లక్షలు వార్షికంగా)
2. రూ. 4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకుక శాతం (గతంలో రూ.2 నుంచి రూ.7 లక్షలు వార్షికంగా)
3. రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు 10 శాతం (గతంలో రూ.7 నుంచి రూ.10 లక్షలు వార్షికంగా)
4. రూ.12 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు 15 శాతం (గతంలో రూ.10 నుంచి రూ. 15 లక్షలు వార్షికంగా). 6. రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు 20 శాతం 7. రూ.20 లక్షల నుంచి రూ.24 లక్షల వరకు 25 శాతం
5. ఏడాదికి రూ.15 లక్షలకు పైగా ఆదాయంపై 30 శాతం పన్ను శ్లాబ్ రద్దు
6. రూ.24 లక్షలకు పైగా ఆదాయం ఉంటే 30 శాతం ట్యాక్స్ విధింపు

## సంస్కారం లేకుండా మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి

### కేసీఆర్ అంటే హిస్టరీ.. రేవంత్ అంటే లాటరీ..

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రేవంత్ రెడ్డి సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రేవంత్ కు తిట్ల పురాణం తప్ప మరేమీ రాదని విమర్శించారు. కానీ మాకు సంస్కారం ఉంది కాబట్టి మేము ఆయనలా మాట్లాడం అని అన్నారు. "కేసీఆర్ నువ్వు కొట్టుడు కాదు.. కట్టె లేకుండా నిలబడు అంటున్నడు. కేసీఆర్ నిలబడడం కాదు.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దేశం ముందు సమున్నంగా నిలబెట్టిండు.. కేసీఆర్ కట్టె లేకుండా నిలబడుతడు.. రేవంత్ రెడ్డి దమ్ముంటే కమిషన్ తీసుకోకుండా ప్రభుత్వాన్ని నడుపు"అని సవాల్ విసిరారు."కేసీఆర్ చంటి పిల్లను సాదుకున్నట్లు పదేళ్ల పాటు తెలంగాణను సాదుకున్నారు.. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపాం. పదేండ్ల పాటు అద్భుతంగా అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడెద్దుల మాదిరిగా ముందుకు తీసుకెళ్లాం అని అన్నారు. తండాలను గ్రామపంచాయతీలు చేశాం. కొత్త మండలాలు, కొత్త రెవెన్యూ డివిజన్లు, జిల్లాలు ఏర్పాటు చేసుకున్నాం. పరిపాలన ఫలాలు మీ ముంగిటకు రావాలని వికేంద్రీకరణ చేసుకున్నాం" అని కేటీఆర్ తెలిపారు.

"కేసీఆర్ కొడితే ఎట్ల ఉంటదో.. నీ పాత గురువు, ఇప్పుడు నీ గురువు తల్లిని అడుగు. కేసీఆర్‌కు, రేవంత్‌కు పోలికనే లేదు. కేసీఆర్ అంటే హిస్టరీ.. రేవంత్ అంటే లాటరీ.. టికెట్ కొనకుండా లాటరీ గెలిచినోడు. తప్పిదారి అడ్డిమారి గుడ్డి దెబ్బలో సీఎం అయితే ఆగతలేడు. నీ కంటే ముందు చాలా మంది సీఎంలుగా చేశారు. కేసీఆర్ పేరును నీవు కాదు కదా.. కాంగ్రెస్ తాత జేజమ్మలు దిగివచ్చినా మరిపించలేరు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంతకాలం ఈ రాష్ట్రం ఎవరు తెచ్చారంటే కేసీఆర్ అంటరు. తిట్ల పురాణం బంద్ చేయ్.. హానీమూన్ పీరియడ్ కూడా అయిపోయింది. కొత్తగా రేవంత్ రెడ్డి సీఎం అయిండు కాబట్టి ఏమన్న చేస్తడోమే అనుకున్నాం.. కానీ ఏం చేయలేదు.ఇక సినిమా ఉన్నది ముంగిట. కేసీఆర్ అసెంబ్లీకి రా అంటున్నడు రేవంత్ రెడ్డి. నీకు దమ్ముంటే లగచర్లకు రా.. నీ సంగతి ఏంటో చెప్తరు. సెక్యూరిటీ లేకుండా రా.. నీవు వస్తవో రావో తెలియదు కానీ త్వరలోనే పక్కా కొడంగల్‌కు దండయాత్రలా వస్తాం. భాజప్తా పోయి కొడంగల్‌లో మీటింగ్ పెడుతాం"అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## తెలంగాణకు గాడిద గుడ్డే

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.50.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చింది గాడిద గుడ్డే అని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్రానికి ఒక్క పైసా కూడా ప్రత్యేకంగా కేటాయించలేదని తెలిపారు. రానున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో అక్కడ రాజకీయ లబ్ది కోసమే బీజేపీ కేంద్ర బడ్జెట్‌ను ఉపయోగించుకుంటుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసే బడ్జెట్‌లో అందరికీ సమానంగా ఇవ్వాలని సూచించారు. నిర్మలమ్మ తెలుగు కోడలు అయి ఉండి కూడా తెలంగాణపై ప్రేమ చూపలేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంపై బీజేపీ సర్కారు వివక్ష చూపిస్తుందని తెలిపారు. రాజకీయంగా తెలంగాణను దెబ్బతీయాలని చూస్తున్నదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, కేంద్ర మంత్రులను, ప్రధాన మంత్రిని కలిసి తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన అనేక అంశాలపై విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. రైల్వే ప్రాజెక్టులు, విభజన హామీలు, పాలమూరు రంగారెడ్డి నీటి పారుదల ప్రాజెక్టుకు జాతీయ హోదా, ఐటీఐఆర్, బయ్యారం కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం లాంటి అనేక ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రం నుంచి రూ. 40 వేల కోట్ల జీఎస్టీ కేంద్రానికి వెళ్తోందని గుర్తు చేశారు. ఆ మేరకు అయిన తెలంగాణకు కేంద్రం నుంచి నిధులు రావాల్సి ఉందని తెలిపారు.

## యువతకు క్రీడలతో మనసికొల్లాసం

**బలగం టీవీ , తంగళ్లపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామంలో సింగం రంజిత్ కుమార్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ని రాజన్న సిరిసిల్ల జిల్లా భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి రెడ్డ బోయిన గోపి ప్రారంభించారు.ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ యువతకు క్రీడలు మనసికొల్లాసానికి తోడ్పడుతాయని, మెరుగైన ఆరోగ్యవంతమైన జీవితం పొందుతారని గెలుపోటములు సహజంగా తీసుకొని యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సంద ర్భంగా తెలిపారు.బిజెపి నాయకులు సిరిసిల్ల వంశీ మరియు క్రీడాకారులు ఆర్గనైజర్లు సింగం చింటూ, జగ్గని రాము యాదవ్, అమరగొండ రాజేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మానందరిపైనా ఉన్నది..

- అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్ -XI విజయవంతం..
- ఎస్పీ అఖిల్ మహాజన్



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మానందరిపైనా ఉన్నదని,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా కృషి చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం సంవత్సరంలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ అనే కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చేలా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.అందులో భాగంగా జిల్లాలో ఆపరేషన్ స్మైల్-XI విజయవంతం కోసం ఈ సంవత్సరం జనవరి 1 నుండి 31 వరకు పోలీస్ శాఖ,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, వివిధ డిపార్ట్మెంటుఅధికారులతో జిల్లాలో టీమ్ లుగా ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించి జిల్లా వ్యాప్తంగా 31 మంది పిల్లలని గుర్తించి వారి యొక్క తల్లిదండ్రుల వద్దకు చేర్చడం జరిగిందని అన్నారు.18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పని చేయిస్తున్న వారిపై 08 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. బాలల చేత పనులు చేయిస్తున్న వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.వీధి బాలలను చూసినప్పుడు, డయల్ 100 లేదా స్థానిక పోలీస్ వారికి సమాచారం అందించాలని. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం చేయడానికి సహకరించిన అన్ని శాఖల అధికారులను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.



## సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా జాన్ వెస్లీ ఎంపిక పట్ల హర్షం

**బలగం టీవీ , బోయినిపల్లి**

భారత కమ్యూనిస్టు పార్టీ మార్కిస్ట్ ఉద్యమ స్ఫూర్తి నాయకుడు జాన్ వెస్లీని పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జాన్ వెస్లీని ఏకగ్రీవం ఎన్నుకోవడం పట్ల సీపీఐ(ఎం) బోయినిపల్లి మండల కమిటీ పక్షాన పత్రిక ముఖంగా హర్షం వ్యక్తం చేశారు. శనివారం పార్టీ మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ జాన్ వెస్లీ విద్యార్థి దశ నుంచే వామపక్ష భావజాలం నాయకునిగా, ఉద్యమకారుడుగా మంచి పేరుపొందిన వ్యక్తి అని,అలాగే కుల వివక్ష వ్యతిరేక కెవిపిఎస్ ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షునిగా అంటరానితనం నిర్మూలన కోసంపార్టీ కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులతో కలిసి ఆయన చేసిన సైకిల్ యాత్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని గుర్తు చేశారు. జాన్ వెస్లీ తెలంగాణ రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎర్ర నాగరాజు, సింగిరెడ్డి శంకర్, అనుముల రవి, కడుదుల రవి, ఆవుల మల్లయ్య, యాదగిరి, లింబాద్రి , వెంకట్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



## ముదిరాజ్ జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లిన ముదిరాజ్ సంఘ సభ్యులు

**బలగం టీవీ , రుద్రంగి**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కళ్యాణ లక్ష్మి గార్డెన్స్ లో శనివారం నిర్వహించిన రాజన్న సిరిసిల్ల జిల్లా ముదిరాజ్ సంఘ జిల్లా, కార్యవర్గం ప్రమాణ స్వీకారానికి రుద్రంగి మండల ముదిరాజ్ సంఘ సభ్యులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.. వారు మాట్లాడుతూ నేడు జిల్లా కేంద్రంలోని ఇటీవల నూతనంగా ఎన్నికైన ముదిరాజ్ జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి పెద్ద ఎత్తున తరలివెళ్లడం జరిగిందని పేర్కొన్నారు..తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ సంఖ్యలో ఉన్న ముదిరాజ్ లు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని అన్నారు.. ముదిరాజ్ కులస్తుల చిరకాల కోరిక అయిన బీసీ డి నుండి బీసీ ఏ లోకి మార్చే ప్రక్రియను ప్రభుత్వం ముందడుగు వేయాలని తెలిపారు.. ఈ కార్యక్రమంలో రుద్రంగి మండల అధ్యక్షులు దాసరి అశోక్,నాయకులు గండి నారాయణ,పోగుల దేవయ్య, గండి అశోక్,పాల నర్సయ్య, జెంగిలి శ్రీకాంత్, రాగుల నరేష్, రణవేణి సందీప్, పోగుల రాజం, తునికి నర్సయ్య, దండవేణి నర్సయ్య, దూలూరు భూమయ్య, తునికి రమేష్, నచారి రాకేష్, పండుగు గంగాధర్, బోన్ల సత్యం, కోమిరే గంగానర్సయ్య, తదితరులు పాల్గొన్నారు...

# గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలయ్యేలా చూడాలిలి
- వైద్య సేవలపై గర్భిణులతో ఫోన్లో మాట్లాడిన కలెక్టర్
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు అయ్యేలా అవగాహన కల్పించాలని వైద్యాధికారులు, సిబ్బందిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. శనివారం కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆసుపత్రి ఆవరణ, ఇన్ పేషెంట్ వార్డ్, ల్యాబ్, ఫార్మసీ పరిశీలించారు. ఓపి, అలాగే రక్త పరీక్షలపై ఆరా తీశారు. అనంతరం పీహెచ్సీ పరిధిలో వైద్య సేవలు పొందుతున్న గర్భిణులతో కలెక్టర్ నేరుగా ఫోన్లో మాట్లాడారు. ఇక్కడ అందుతున్న సేవలు, మందులువారి ఆరోగ్య వివరాలు తెలుసుకు న్నారు. ఫార్మసీ నీ పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.దాదాపు అనంతరం వైద్యులు, ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతూ మండలంలోని గర్భిణులకు ప్రభుత్వ దావకానాల్లో అందిస్తున్న సేవలు, మందులపై అవగాహన కల్పించాలని వారు ఈ సేవలను వినియోగించుకునేలా చూడాలని ఆదేశించారు.



గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని నిరంతరం వారి ఆరోగ్య వివరాలను సేకరిం చాలని వారికి కావాల్సిన మందులు అన్ని అందుబాటులో ఉంచాలని వైద్యులకు సూచించారు.

### 10 జీపీఏ వచ్చేలా తీర్చిదిద్దాలి..

రానున్న పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు 10 జీపీఏ అన్ని సబ్జెక్టుల్లో వచ్చేలా తీర్చిదిద్దాలని ఆయా సబ్జెక్టు టీచర్లకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. కొనరావుపేటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు తరగతి గదులు, స్టోర్ రూమ్ ఆహారం వండే గదిని పరిశీలిం చారు. కూరగాయలు, సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు మ్యాథ్స్ సైన్సు పాఠ్యాంశాలు బోధించారు. వారి అనుమానాలను నివృత్తి చేశారు. అలాగే విద్యార్థులకు వైద్య సిబ్బందితో పరీక్షలు చేయించాలని, వారికి కావాల్సిన మందులను అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

రానున్న పబ్లిక్ పరీక్షల దృష్ట్యా అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా ప్రణాళిక ప్రకారం చదివించాలని ప్రాక్టీస్ టెస్టులు రాయించాలని సూచించారు. ప్రతి విద్యార్థి పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అలాగే ఇంటర్ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. తరగతి గదులు సైన్స్ ల్యాబ్ లు, టాయిలెట్స్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

### కార్యాలయాలు తనిఖీ..

అనంతరం కలెక్టర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసిల్దార్ కార్యాలయాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. తహసీల్ కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. మండల స్థాయి అధికారులు విధుల్లో భాగంగా క్షేత్రస్థాయిలోకి వెళితే కార్యాలయంలో ఉన్న సిబ్బందికి సమాచారం ఇచ్చి వెళ్లాలని సూచించారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు హాజరు కావద్దని స్పష్టం చేశారు.ఈ ఇక్కడ పి హెచ్ సి డాక్టర్ వేణుమాధవ్, కేజీబీవీ ఎస్ఓ ఇందిరా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేదారీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భక్త మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు..

**బలగం టీవీ , బోయినిపల్లి**



శ్రీభక్త మార్కండేయ మహర్షి జయంతిని పురస్క రించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొత్తపేట గ్రామంలో పద్మశాలి సమాజ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ సీతరామంజనేయ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు మంగళ హారతులు,భగవంతుని నామ స్మరణ తో భజనలు పూజలు చేశారు.అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపద్మశాలి సమాజ సేవా సంఘం అధ్యక్షులు డి. శ్రీహరి, బోయినిపల్లి మండల పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు చిందం వేణు, గ్రామ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు డి.కమలాకర్, కోశాధికారి డి.రవీందర్, కమిటీ సభ్యులు డి.రాములు, డి. విఠల్, సి.హెచ్ కృష్ణహరి, డి.వెంకటేశం, డి.కరుణాకర్, బి.ఫణీంద్ర మరియు ముఖ్య అతిథులు, ఆలయ కమిటీ చైర్మన్ జి, రమేశ్, పాలక మండలి సభ్యులు, గ్రామంలోని అన్ని కుల సంఘ నాయకులు, కొత్తపేట మానువాడ, మల్లాపూర్, గ్రామాల పద్మశాలి కూలబాంధవులు, యువకులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ముదిరాజుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.



- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ , సిరిసిల్ల**

ముదిరాజుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని,ముదిరాజ్ ల చిరకాల కోరిక బీసీ డి నుండి బీసీ ఏ లోకి మార్చడానికి నా వంతు ప్రయత్నం చేస్తానని ప్రభుత్వ విప్, వేముల వాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ అన్నారు.శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కళ్యాణ లక్ష్మి గార్డెన్స్ లో జిల్లా ముదిరాజ్ సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మహేందర్ రెడ్డి తో కలసి తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ముదిరాజ్ కులస్తులకు నూతన కార్యవర్గం ఒక దిక్సూచిగా అండగా ఉండాలని, ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలును అందరికి అందేలా చూడాలని అన్నారు.

రాబోవు రోజుల్లో ముదిరాజుల అభివృద్ధి కి పాటు పడాలని,కులం ఒక బలం బలగం లాగా పని చేస్తుందని, కలసి గట్టుగా ఉండి ఇతర కులాలను కలుపు కొని రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని అన్నారు.గ్రామాల్లో ప్రశ్నించే వారికి గొప్ప గుర్తింపు ఉంటుం దని,సాటి బీసీ బిడ్డలుగా బీసీ,ఎస్టీ ఎస్సీ, లకు అండగా ఉండాలని అన్నారు. పని చేసిన వారికి ప్రజలు తప్పకుండా పట్టం కడతారని,వారికి గుర్తింపు తప్పకుండా వస్తుందని,నాకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకున్నా ఈ రోజు మీ ముందు ఉన్నానని అన్నారు. మిడ్ మానేరు డ్యాం లో చేపల పెంపకానికి కేజీ కల్చర్ ద్వారా సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని, మత్స్యకారులు ఈ పథకాన్ని వియోగించుకోవాలని,ప్రభుత్వం తరఫున సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని అన్నారు.రాహుల్ గాంధీ దేశంలోని అసమానతలు రూపుమాపడానికి కుల గణన జరగాలని పేరొన్నారని,దానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో కుల గణన నిర్వచించడం జరిగిందని, త్వరలోనే బీసీ ల రిజర్వేషన్ పెంచడం జరుగుతుందని అన్నారు.

ప్రజా ప్రభుత్వంలో ఇంచుమించు 50 కోట్లతో 16 కలలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని,రానున్న రోజుల్లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనర్టీ లము అందరూ కలసి గట్టుగా ఉండాలని అన్నారు. మహాత్మా జ్యోతి రావు పూలే పేరును ప్రజా ప్రభుత్వంలో ప్రగతి భవన్ కు ప్రజా భవన్ గా నామకరం చేశారని,మహనీయుల అడుగు జాడల్లో నడుస్తూ ముందుకు పోదామని, ముదిరాజ్ జిల్లా సంఘ భవనానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

# కంకషన్ సబ్‌స్టిట్యూట్‌పై వివాదం




- శివమ్ దూబే స్థానంలో హర్షిత్ రాణాను ఆడించడంపై విమర్శలు
- నాకి ఇది ఒక డ్రీమ్ డెబ్యూట్ : హర్షిత్ రాణా

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా పుణె వేదికగా జరిగిన నాలుగో టీ20లో టీమిండియా విజయం సాధించింది. అయితే ఈ మ్యాచ్‌లో హర్షిత్ రాణా కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగడం వివాదాస్పదమైంది. శివమ్ దూబే స్థానంలో ఇన్నింగ్స్ మధ్యలో కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా అరంగేట్రం చేసిన హర్షిత్ రాణా.. మ్యాచ్ విన్నింగ్ పెర్ఫామెన్స్ కనబర్చాడు. భారత బ్యాటింగ్ సందర్భంగా ఆఖరి ఓవర్‌లో జేమీ ఓవర్టన్ వేసిన బౌన్సర్ శివమ్ దూబే హెల్మెట్‌కు బలంగా తాకింది. రూల్స్ ప్రకారం ఫిజియోలు వచ్చి అతన్ని పరీక్షించారు. బాగానే ఉందని చెప్పిన శివమ్ దూబే బ్యాటింగ్ కూడా కొనసాగించాడు. కానీ ఏమైందో ఏమో తెలియదు కానీ అతను ఫీల్డింగ్ చేయలేదు. రెండు ఓవర్ల తర్వాత అతని స్థానంలో హర్షిత్ రాణా కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగాడు. 3 కీలక వికెట్లు తీయడంతో పాటు ఓ క్యాచ్ కూడా అందుకున్నాడు. అయితే హర్షిత్ రాణాను కంకషన్ రూల్స్‌కు విరుద్ధంగా ఆడించారని ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్‌తో పాటు మాజీ క్రికెటర్లు ఆరోపిస్తున్నారు. శివమ్ దూబేకు హర్షిత్ రాణా సరిపోలే ఆటగాడు కాదని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అయితే ఈ వ్యవహారంపై సోషల్ మీడియా వేదికగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మ్యాచ్ రిఫరీ జవగళ్ శ్రీనాథ్ టీమిండియాకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నాడని ఆరోపిస్తున్నారు. పేస్ ఆల్‌రౌండర్ అయిన శివమ్ దూబే స్థానంలో స్పెషలిస్ట్ పేసర్ హర్షిత్ రాణాను ఎలా అనుమతిస్తారని ప్రశ్నిస్తున్నారు. హర్షిత్ రాణాకు బ్యాటింగ్ చేసే సామర్థ్యం ఉన్నా అతను ఆల్‌రౌండర్ కాదని కామెంట్ చేస్తున్నారు.

ఇదిలా ఉండగా హర్షిత్ రాణా మాట్లాడుతూ "నాకు ఇప్పటికీ ఇది ఓ డ్రీమ్ డెబ్యూట్. దూబె డ్రెస్సింగ్ రూమ్‌లోకి వచ్చిన రెండు ఓవర్ల తర్వాతనే నాకు ఈ విషయం గురించి తెలిసింది. కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా ఆడాలని, దానికి సిద్ధంగా ఉండమని చెప్పారు. అయితే నేను కేవలం ఈ సిరీస్ కోసమే కాదు ఎన్నో ఏళ్లుగా భారత టీ20 జట్టులోకి అడుగు పెట్టేందుకు నేను ఎంతగానో వేచి ఉన్నాను. ఇప్పుడు నాకు ఈ ఛాన్స్ వచ్చింది. అందుకే నన్ను నేను ఎలాగైనా నిరూపించుకోవాలని భావించాను. ఐపీఎల్‌లో మంచి బౌలింగ్ స్కిల్స్‌తోనే ఆడాను. ఇప్పుడూ అలాగే బౌలింగ్ చేసి ఫలితాలను సాధించాను" అని అన్నాడు.

హర్షిత్‌ను కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా తీసుకోవడం పట్ల ఇంగ్లాండ్ కెప్టెన్ జోస్ బట్లర్ కాస్త అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఫీల్డ్ అంపైర్లతో మాట్లాడినప్పటికీ ఫలితం మాత్రం భారత్‌కు అనుకూలంగా వచ్చింది. మ్యాచ్ తర్వాత బట్లర్ ఈ విషయంపై స్పందించాడు. "ఈ రిప్లేస్‌మెంట్ ఏ మాత్రం సరైనది కాదు. మేం దీంతో అస్సలు ఏకీభవించట్లేదు. మాతో వాళ్లు ఏ మాత్రం సంప్రదించలేదు. నేను బ్యాటింగ్‌కు వచ్చిన సమయంలో హర్షిత్ ఎందుకు ఫీల్డింగ్‌లో ఉన్నాడు? అని అడిగాను. దానికి వాళ్లు కంకషన్ సబ్ అని బదులిచ్చారు. మ్యాచ్ రిఫరీ ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. దీనిపై జవగళ్ శ్రీనాథ్‌ను క్లారిటీ ఇవ్వాలని అడుగుతాం" అని జోస్ అన్నాడు.

### ఐసీసీ రూల్స్

కంకషన్ సబ్‌స్టిట్యూట్ రూల్స్ ప్రకారం ఒకరికి బదులు మరొకరిని ఆడేందుకు మాత్రమే అనుమతించొచ్చు. అయితే, బ్యాటర్ స్థానంలో బ్యాటర్ లేకుంటే బౌలర్ స్థానంలో బౌలర్ లేదా ఆల్‌రౌండర్ స్థానంలో ఆల్‌రౌండర్‌కు మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. ఏదైనా జట్టు కోరిక మేరకు ఐసీసీ రిఫరీ ఈ రీప్లేస్‌మెంట్‌కు అనుమతించాల్సి ఉంటుంది. అతడిదే తుది నిర్ణయం కూడా అవుతుంది. అయితే దీనిపై ప్రత్యర్థి జట్టుకు అప్పీలు చేసేందుకు ఏ మాత్రం హక్కు ఉండదు.

# అందులో రిఫరీదే తుది నిర్ణయం




టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్

**బలగం టీవీ, హైదరాబాద్**

శివమ్ దూబేకు తలనొప్పి లక్షణాలు మొదలైనట్లు చెప్పడంతోనే కంకషన్ సబ్‌స్టిట్యూట్‌ను వాడుకున్నామని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తెలిపాడు. మ్యాచ్ రిఫరీ అనుమతితోనే హర్షిత్ రాణాను బరిలోకి దించామని స్పష్టం చేశాడు. 'బ్యాటింగ్ సమయంలో శివమ్ దూబే హెల్మెట్‌కు బంతి బలంగా తాకింది. ఇన్నింగ్స్ బ్రేక్ సమయంలో తలనొప్పిగా ఉందని దూబే సమాచారమిచ్చాడు. దాంతో అతనికి బదులుగా మరొకరిని మ్యాచ్ రిఫరీకి తెలియజేశాం. సరైన సబ్‌స్టిట్యూట్ పేరునే ఇచ్చాం.ఆ తర్వాతే రిఫరీ నిర్ణయం తీసుకున్నారు. ఆ సమయంలో హర్షిత్ రాణా డిన్నర్ చేస్తున్నాడు. వెంటనే సిద్ధమై ఫీల్డింగ్‌కు దిగాడు. అసాధారణ బౌలింగ్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఎవరినైనా ఆడించే అధికారం ఎవరికి ఉండదు. పేరు ఇవ్వడం వరకే మా పని. మ్యాచ్ రిఫరీ తుది నిర్ణయం తీసుకుంటారు. రిఫరీ నుంచి అనుమతి రావడంతోనే హర్షిత్ రాణాను బరిలోకి దించాం.'అని మోర్నీ మోర్కెల్ చెప్పుకొచ్చాడు.

# రైల్వేస్‌పై ఢిల్లీ ఘన విజయం



**బలగం టీవీ, హైదరాబాద్**

రంజీ ట్రోఫీ 2024-25 సీజన్‌లో రైల్వేస్ జట్టుపై ఢిల్లీ ఘన విజయం సాధించింది. శనివారం ముగిసిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 19 పరుగుల తేడాతో గెలుపొందింది. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఢిల్లీ తరఫున బరిలోకి దిగడంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన రైల్వేస్ తొలి ఇన్నింగ్స్‌లో 241 పరుగులకు ఆలౌటైంది. అనంతరం ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌లో 374 పరుగుల భారీ స్కోర్ చేసింది. కోహ్లీ విఫలమైనా.. ఆయుష్ బదోని(99), సుమిత్ మాథుర్(86) రాణించారు. దాంతో ఢిల్లీకి 133 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో రైల్వేస్ 114 పరుగులకే పరిమితమై ఓటమిపాలైంది. ఇక కోహ్లీ తొలి ఇన్నింగ్స్‌లో 15 బంతుల్లో 6 పరుగులే చేసి కోహ్లీ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. హిమాన్షు సంగ్వాన్ స్టన్నింగ్ ఇన్ స్వింగర్‌తో కోహ్లీని ఔట్ చేశాడు. అయితే కనీసం రెండో ఇన్నింగ్స్‌లోనైనా అతని బ్యాటింగ్ చూడాలని ఫ్యాన్స్ భావించారు. కానీ ఢిల్లీ బౌలర్లు ఆ అవకాశమే ఇవ్వలేదు. రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన రైల్వేస్‌ను 114 పరుగులకే ఆలౌట్ చేయడంతో రెండో ఇన్నింగ్స్ ఆడాల్సిన అవసరం లేకుండానే ఢిల్లీ విజయం సాధించింది.

## ముద్దుల వివాదంపై స్పందించిన ఉదిత్ నారాయణ్

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రముఖ గాయకుడు ఉదిత్ నారాయణ్ మహిళా అభిమానులతో అనుచితంగా ప్రవర్తించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ముంబయిలో జరిగిన ఓ కన్సర్ట్‌లో తనతో సెల్ఫీలు దిగిన మహిళా అభిమానులకు ఉదిత్ నారాయణ్ ముద్దులు పెట్టారు. సెల్ఫీలు ఇస్తూ మహిళా ఫ్యాన్స్‌ను కిస్ చేయడం వీడియోలో ఉంది. ు వీడియో బయటకు రావడం, అది కాస్తా సోషల్ మీడియాలో వైరల్ కావడంతోనెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా ఈ వివాదంపై ఆయన ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఫ్యాన్స్‌పై తనకున్న అభిమానాన్ని తెలియజేయడానికే తాను అలా చేశానన్నారు. తనకు వేరే ఉద్దేశం లేదని తెలిపారు. కొందరు కావాలనే దీనిని వివాదంగా చూస్తున్నారని చెప్పారు.

"అభిమానులకు నేనంటే చాలా ఇష్టం. కొంతమంది కరచాలనం చేయడానికి ప్రయత్నిస్తే, మరికొంత మంది కిస్ చేయడానికి ప్రయత్నిస్తుంటారు. అదంతా కేవలం ఆత్మీయతతో కూడుకున్న విషయం. సమాజంలో ఎంతో పేరు, మర్యాద కలిగిన వ్యక్తిని నేను. అభిమానులతో తప్పుగా ప్రవర్తించే ఉద్దేశం నాకు లేదు. వివాదాలకు దూరంగా ఉంటాను. కొంతమంది కావాలనే దీన్ని వివాదంగా చూస్తున్నారు" అని ఉదిత్ నారాయణ్ అన్నారు.



## తండేల్ ప్రీ రిలీజ్ ఈవెంట్ వాయిదా..

**బలగం టీవీ, హైదరాబాద్**

నాగ చైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం తండేల్ . సాయి పల్లవి కథనాయికగా నటిస్తుండగా.. చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్నాడు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న సందర్భంగా శనివారం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించబోతున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వేడుకను ఆదివారానికి వాయిదా వేస్తున్నట్లు చిత్రయూనిట్ ఎక్స్ వేదికగా ప్రకటించింది. "ది ఐకానిక్ తండేల్ జాతరను రేపటికి వాయిదా వేస్తున్నాం. ఈవెంట్ భారీ స్థాయిలో ఉంటుంది. ఈ పాలి యాట గురితప్పేదే లేదేస్" అంటూ పోస్ట్ పెట్టింది. ఇక ఈ వేడుకకు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ముఖ్య అతిథిగా రాబోతున్నారు.



## అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'తంగలాన్'

**బలగం టీవీ, హైదరాబాద్**

తమిళ స్టార్ నటుడు విక్రమ్, పా. రంజిత్ కాంబోలో వచ్చిన చిత్రం తంగలాన్. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కేజీఎఫ్)లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా వచ్చిన ఈ చిత్రం గత ఏడాది విడుదలైంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం ప్రస్తుతం ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతుంది. అయితే తాజాగా ఈ చిత్రం అరుదైన ఘనతను సాధించింది. తంగలాన్ చిత్రం అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్లో ప్రదర్శితం కాబోతుంది. నెదర్లాండ్స్ వేదికగా జరుగుతున్న రాటర్‌డామ్ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్లోఈ సినిమా డైరెక్టర్ కట్ ప్రదర్శితం కాబోతున్నట్లు దర్శకుడు పా.రంజిత్ ఎక్స్ వేదికగా ప్రకటించాడు.

## అనారోగ్యానికి గురైన సాయిపల్లవి

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ సినీ నటి సాయిపల్లవి అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయాన్ని దర్శకుడు చందు మొండేటి వెల్లడించారు. సాయి పల్లవి కొన్ని రోజుల నుంచి జ్వరం, జలుబుతో బాధ పడుతున్నారని తెలిపారు. అనారోగ్యంతో ఉన్నప్పటికీ ఆమె 'తండేల్' సినిమాకు సంబంధించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారని... దీంతో ఆమె మరింత నీరసించిపోయారని చెప్పారు. కనీసం రెండు రోజుల పాటు బెడ్ రెస్ట్ తీసుకోవాలని ఆమెకు డాక్టర్లు సూచించారని తెలిపారు. ఈ కారణం వల్లే ముంబైలో జరిగిన 'తండేల్' ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో సాయిపల్లవి పాల్గొనలేకపోయారని చెప్పారు.

**బలగం టీవీ, హైదరాబాద్**

**విక్టరీ వెంకటేష్ నటించిన ఓటిటి సిరీస్ సీక్వెల్ రానా నాయుడు 2 పై విడుదలపై కాస్త క్లారిటీ వచ్చింది. ఈ ఫిబ్రవరి 3న నెట్ ఫ్లిక్స్ నుంచి రానుందని తెలుస్తుంది. లేటెస్ట్ గా నెట్ ఫ్లిక్స్ వారు అనేకమంది సినీ తారలతో మీరు ఫిబ్రవరి 3 కోసం ఇంకా సిద్ధంగా లేరు అంటూ ఓ పోస్ట్ కొన్ని అనౌన్సమెంట్ లని సిద్ధం చేస్తున్నట్టుగా కనిపిస్తున్నారు. మరి ఇలా వెంకీ మామ నుంచి కూడా రాగా ఆరోజున రానా నాయుడు 2 పై ఏమన్నా క్లారిటీ వస్తుందేమో చూడాలి.**

